

క్లుప్తంగా

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాపూర్: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజాపూర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలో నీటి సంరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకతపై విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం, మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవడం వంటి అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



నవాబుపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరి సహకారం అవసరమని ఎస్ఐ విక్రమ్ అన్నారు. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన రాజశేఖరరెడ్డి తన తండ్రి యాదిరెడ్డి జ్ఞాపకార్థం గురువారం రోడ్డు సేఫ్టీ సూచిక బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో 50 శాతానికి పైగా మరణాలు కేవలం రోడ్డు ప్రమాదాల్లోనే సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, రవీందర్, కిరణ్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



కోయిల్‌కొండ: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వన మహోత్సవానికి సిద్ధం చేయాలని డీవైఎస్ఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లి, శేరి వెంకటాపూర్, కోయిల్‌కొండ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించి సంరక్షించాలని ఆయన సూచించారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎన్‌హెచ్-44పై గురువారం రోడ్డు ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం మరమ్మతుకు గురై అడ్డాకుల వద్ద అండర్ బ్రిడ్జిపై నిలిచింది. దాన్ని వెనుక వచ్చిన బొలెరో వాహనం డీసీఎంను ఢీకొట్టింది. ప్రమాదంలో బొలెరో డ్రైవర్ పృథ్వీరాజ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. అయితే డీసీఎం నిలిచిన చోట సరైన జాగ్రత్తలు పాటించక పోవడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని బొలెరో డ్రైవర్ పృథ్వీరాజ్ ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ పాండుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ @ రూ.6,646

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం వేరుశనగ క్వింటాల్ గరిష్ఠంగా రూ. 6,646, కనిష్ఠంగా రూ. 5,222 ధరలు లభించాయి. అదే విధంగా కందులు గరిష్ఠంగా రూ. 6,001, కనిష్ఠంగా రూ. 5,000, మొక్కజొన్న గరిష్ఠంగా రూ. 2,281, కనిష్ఠంగా రూ. 1,827, జొన్నలు గరిష్ఠంగా రూ. 4,377, కనిష్ఠంగా రూ. 4,089, ఆముదాలు గరిష్ఠంగా రూ. 6,329, కనిష్ఠంగా రూ. 6,270, మినుములు రూ. 7,316, రాగులు గరిష్ఠంగా రూ. 3,077, కనిష్ఠంగా రూ. 2,207 ధరలు వచ్చాయి.

■ దేవరకద్ర మార్కెట్‌యార్డులో జరిగిన ఈ టెండర్లలో ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 2,039, కనిష్ఠంగా రూ. 1,909 ధరలు లభించాయి. ఆముదాలు గరిష్ఠంగా రూ. 6,011, కనిష్ఠంగా రూ. 6,000 ధరలు వచ్చాయి. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు దాదాపు 400 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

దివ్యాంగులకు యూడీఐడీలు



దివ్యాంగులకు యూడీఐడీ దరఖాస్తు చేయడంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణకు హాజరైన మీ సేవ నిర్వాహకులు (ఫైల్)

- అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
- 21 కేటగిరీలకు అవకాశం
- కార్డుతో మరింత ప్రయోజనం
- పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు 13, 856 మంది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లకు రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. వాటి స్థానంలోయూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. దివ్యాంగులు నేరుగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇటీవల సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులందరికీ ఈ యూడీఐడీ నంబర్‌ను కేటాయించాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్డుల కోసం ప్రభుత్వం ఇచ్చిన సంబంధిత వెబ్‌సైట్‌లో దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటివరకు కేవలం ఏడు కేటగిరీల్లో మాత్రమే సదరం సర్టిఫికెట్లు ఇస్తుండగా, ఈయూడీఐడీ కార్డుల అమలుతో ఇక నుంచి 21 కేటగిరీలకు అవకాశం కల్పించారు. జిల్లాలో



పరిధిలో 13,856 మంది శాశ్వత వైకల్యం కలిగిన వారు ఉన్నారు. దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.4,016ను ప్రతినెలా అందిస్తున్నారు. స్వయం ఉపాధి కోసం వివిధ రకాల రాయితీ రుణాలు సైతం అందుతాయి.

కార్డు పొందడం ఇలా..

ఇప్పటి వరకు ఇస్తున్న సదరం ధ్రువప త్రాలు ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే పనిచేస్తు న్నాయి. ఇతర రాష్ట్రాల్లో వీటిని అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో వీటికి బదులు యూడీఐడీ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. http://www.swavlambancard.gov.in పోర్టల్లోకి వెళ్లి యూడీఐడీ కార్డు కోసం సమగ్ర వివరాలు పొందుపర్చాలి.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల స్థానంలో యూడీఐడీ కార్డులను ఆమ ల్లోకి తెచ్చింది. వీటిపై దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో అర్హులందరికీ స్మార్ట్ కార్డు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇది అన్ని ప్రాంతాల్లో చెల్లుబాటవుతుంది. దివ్యాంగులకు దీంతో మరింత ప్రయోజనం. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.
>
> – నర్సింహులు, డీఆర్డీఓ, మహబూబ్‌నగర్

సీసీరోడ్డు పనులు ప్రారంభం



మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో గురువారం రూ. 15లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. సీసీరోడ్డు పనులను నాణ్యతగా నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, విజయాజీ, బాబా, రవీందర్‌రెడ్డి, మైసయ్య, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రంగారెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పంచముఖ అంజన్న బ్రహ్మోత్సవాలు



కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లిలో శ్రీపంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజున దీపారాధన, పుణ్యాహ వాచనం, అభిషేకం, హోమం, శనివారం తెల్లవారుజామున రథోత్సవం, పల్లకీ సేవ, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకుడు వెంకటేష్ తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు సాహితీ, లుంబిని హైస్కూల్, మా ఆకృతి హైస్కూల్ ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం లుంబిని పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కవి సమ్మేళనం, పార్ల లింగప్ప రచించిన పరమాత్మ దర్శనం పుస్తకావిష్కరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, పుస్తకావిష్కర్తగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కవి సమ్మేళనానికి కవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



దేవరకద్ర: రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష చేపట్టిన ముస్లింలకు ఏర్పాటుచేసే ఇఫ్తార్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కౌకుంట్ల జామియా మసీద్‌లో సదర్‌సాబ్ షేక్ అబ్దుల్ జహంగీర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాసదీక్ష విరమింపచేశారు. ఈ సందర్భంగా ఖురాన్ కంఠస్థం చేసిన ఆఫీస్, మోజం సాబ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కిష్టన్న, తుమ్మల శేఖర్‌రెడ్డి, కేబీఆర్ గౌడ్, షబ్బీర్ అలీ, రెహమాన్, ఇంతియాజ్, బాబుజానీ, నీలి ఆంజనేయులు, వెంకటన్న, నరసింహ, నరేందర్‌గౌడ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సహకార క్లబ్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న శంకరాచారి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థి సహకార క్లబ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని జిల్లా సహకార అధికారి శంకరాచారి కోరారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సహకార సంఘాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సహకార క్లబ్ ఏర్పాటు చేశారు. అనంతరం శంకరాచారి మాట్లాడుతూ సహకార సంఘాలు వివిధ రకాల కులవృత్తులను బలోపేతం చేస్తూ.. వారు స్వయం సమృద్ధి సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ప్రోగ్రాం అధికారి నర్సింహులు, సహకార అధికారులు వీరభద్రయ్య, దివ్య, నాగరాజు పాల్గొన్నారు.

బైక్‌ల సైలెన్సర్లు మారిస్తే కేసులు



బైక్ మెకానిక్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో శబ్ద కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో పోలీసులకు బైక్ మెకానిక్‌లు సహకరించాలని ట్రాఫిక్ సీఐ భగవంతురెడ్డి అన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం బైక్ మెకానిక్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను బైక్‌లకు ఉపయోగించడం వల్ల తీవ్ర శబ్దకాలుష్యం పెరుగుతోందన్నారు. దీన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ నియంత్రణ చేయడంపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. మెకానిక్‌లు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బైక్‌లకు అమర్చరాదన్నారు. ఇకపై జిల్లా కేంద్రంలో సైలెన్సర్లు మార్పు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అధిక శబ్దాలు చేస్తూ ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

రైస్‌మిల్లు, సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు తీర్మానం



పీఏసీఎస్ మహాజన సభలో పాల్గొన్న సభ్యులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి సింగిల్‌విండో గోదాము వద్ద రైస్‌మిల్లు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ మహాజన సభలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గురువారం బాదేపల్లి సింగిల్‌విండోలో చైర్మన్ సుదర్శన్‌గౌడ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయ మార్గాలను సమకూర్చుకునే అంశాలపై చర్చించారు. నాగసాల సమీపంలో నాబార్డు ఆర్థిక సహకారంతో నిర్మించిన గోదాము నిరుపయోగంగా మారిందని.. ఎవరూ అద్దెకు రావడం లేదన్నారు. గోదాముకు అనుబంధంగా రైస్‌మిల్లు నిర్మాణంతో ఆర్థిక వనరులు పెంచుకోవచ్చని స్పష్టం చేశారు. అలాగే సంఘానికి కొత్తగా సభ్యత్వం తీసుకోవాలని సభ్యులు సూచించగా.. ఆమోదించారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కె.లక్ష్మయ్య, పిట్టల మురళి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు జీవన్ గుండప్ప, గంగాపురం చంద్రయ్య, హతీరాం నాయక్, ఎనుముల రామకృష్ణారెడ్డి, అల్లాపురం నర్సింహారెడ్డి, సీఈఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా కేంద్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలల జాబితాను అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర నాయకుడు యాంకి రమేష్ ఉన్నారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం



కళాకారులను సత్కరిస్తున్న శివకుమార్

జడ్చర్ల టౌన్: అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకుందామని రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని చంద్రగార్డెన్‌లో నవజ్యోతి కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగస్థల నటులు, కళాకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాచీన కళలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రంగస్థల కళాకారులను శాలువాలతో సత్కరించారు. సమావేశంలో అయ్యన్న, దామోదర్, కృష్ణ, నర్సింహులు, ప్రభు, రాధాకృష్ణ, సుదర్శన్, దత్తుకుమార్, ఉమ్మెంతల మహేశ్వర్, జనార్దన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

■ జడ్చర్ల మండలంలోని బూర్గుపల్లిలో శ్రీకృష్ణ కళా మండలి ,అధ్యక్షుడు గోరంట్ల మల్లేష్ ఆధ్వర్యంలో కళాకారులు సత్కరించారు. కార్యక్రమంలో బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, శంకరయ్య, రాములు, పంతులు రఘురాములు, చిన్నకృష్ణయ్య, లకోటి గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

దేవరకద్ర: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవరకద్ర జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో విద్యార్థులు నిర్వహించిన ది లైఫ్ అనే నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, కళా వికసిత కల్చరల్ థియేటర్ సంయుక్తంగా నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళా వికసిత కల్చరల్ థియేటర్ అధ్యక్షుడు ఖలీమ్ ఆజాద్, హెచ్ఎం రామలింగం, గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థుల నాటక ప్రదర్శన

వందశాతం పన్ను వసూలు



నవాబుపేట గ్రామపంచాయతీ కార్యాలయం

నవాబుపేట: మండలంలోని గ్రామపంచాయతీల్లో పన్నుల వసూలు దాదాపుగా వందశాతం పూర్తయ్యింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరు వరకు పన్ను వసూలు గడువు విధించారు. అయితే మండలంలో విలీన గ్రామాలు మినహా.. 42 జీపీల్లో పన్నుల వసూలు చేపట్టారు. ఇప్పటి వరకు 39 జీపీల్లో వంద శాతం టార్గెట్ పూర్తిచేశారు. మిగతా మూడు జీపీల్లో సైతం 90 శాతానికి పైగా పన్నులు వసూలయ్యాయి. ఆయా గ్రామాల్లోనూ ఈ నెలాఖరులోగా వందశాతం వసూలు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పన్నుల వసూలును వేగవంతం చేశారు. కాగా, నవాబుపేట, ఇప్పటూర్, కొల్లూర్, కారుకొండ, కూచూర్, చౌడూర్ గ్రామాల్లో వ్యాపార తదితర లైసెన్స్‌ల ద్వారా టార్గెట్‌కు మించి అదనంగా పన్నులు వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. 42 జీపీల్లో మొత్తం రూ. 64.23 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా.. ఈ నెలాఖరులోగా టార్గెట్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ జయరాం నాయక్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలు బాధ్యతగా పన్నులు చెల్లిస్తున్నట్లు వివరించారు. పంచాయతీ అధికారులతో పాటు ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

మెడికల్ బిల్లులు మంజూరు చేయండి



జెడ్పీ సీఈఓతో మాట్లాడుతున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ చెల్లింపులు పెండింగ్‌లో లేకుండా చూడాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్ యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డిని కలిసి జీపీఎఫ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మదన్మోహన్ మాట్లాడుతూ.. మెడికల్ బిల్లులతో పాటు మ్యారేజ్‌కు సంబంధించిన బిల్లులను మంజూరు చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం సీఈఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, చంద్రశేఖర్, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, శ్రీకాంత్, రాఘవేంద్ర, శశిధర్ యాదవ్, విజయ్‌కుమార్, ఉదయ్, నేపాల్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పెంచాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును మే 31వ తేదీ వరకు పెంచాలని రియల్‌ఎస్టేట్ వ్యాపారుల జేఏసీ అధికార ప్రతినిధి రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ విజయేందిరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలోనే ఉగాది, రంజాన్ పండుగలు ఉండటంతో 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించడానికి ప్రజలు ముందుకు రావడం లేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి, మే 31వ తేదీ వరకు గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేజీబీవీ ఎస్ఓగా సరస్వతీబాయి

రాజాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓగా సరస్వతీబాయి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఓతో పాటు ఇద్దరు సీఆర్టీలను కొన్ని రోజుల క్రితం అధికారులు బదిలీ చేశారు. ఈ క్రమంలో బాలానగర్ బాలికల పాఠశాల హెచ్ఎం సరస్వతీబాయిని రాజాపూర్ కేజీబీవీ ఎస్ఓగా నియమిస్తూ డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతులను ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. చేతికొచ్చిన వరిపంట వడగండ్ల వర్షానికి దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

30 నుంచి కలశాల ప్రతిష్ఠాపన పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నూతన కలశాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీసు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా నాగదేవత, నవగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించాలి



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డమీది గోపాలకృష్ణ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న మాదిగలకు చట్టసభల్లో ఎక్కువగా అవకాశం కల్పించలేదన్నారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ స్థానానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవికి అవకాశం కల్పించాలని కోరారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్, కృష్ణకుమార్, గొరిట దినేష్, వెంకట్రాములు, అరుణ్‌కుమార్, కృష్ణకాంత్, గోవర్ధన్‌నాయక్ ఉన్నారు.

తైబజార్ వేలం రూ.6 లక్షలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం తైబజార్‌కు వేలం నిర్వహించగా.. గ్రామానికి చెందిన రషీద్ రూ. 6లక్షల 9వేలకు దక్కించుకున్నారు. అదే విధంగా పశువుల సంతను రూ. 53,500లకు ఆంజనేయులు అనే వ్యక్తి కై వసం చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్, విద్యాసాగర్‌గౌడ్, జి.రవీందర్, జగన్, బండి యాదవ్‌కుమార్, కృష్ణయ్య, గౌస్, నాగరాజు, రామస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

రేపు మిడ్జిల్ తైబజార్ వేలం

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంత, కూరగాయల సంతలకు ఈ నెల 29న పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సాయన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు పశువుల సంతకు రూ. 40వేలు, కూరగాయల సంతకు రూ. 20వేలు డిపాజిట్ చెల్లించి.. వేలంలో పాల్గొనాలని సూచించారు.

వేములలో 'దుమ్ము' రేగుతోంది!

- అసంపూర్తి రోడ్డు పనులతో అవస్థలు



వేములలో కంకర వేసి వదిలేసిన రోడ్డు

అడ్డాకుల: ఎన్‌హెచ్-44 నుంచి మూసాపేట మండలం వేముల మీదుగా రాయచూర్ రోడ్డు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు పనులు ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా నిలిచాయి. 2017లో డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ. 17కోట్లు మంజూరు కాగా.. అప్పటి మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. కొంత దూరం మాత్రమే పనులు చేపట్టి వదిలేశారు. అయితే వేములకు వెళ్లే దారిలో చందమామ బావి వద్ద అసంపూర్తి పనులతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. గ్రామంలోని వాటర్ ట్యాంక్ నుంచి ఊరి చివరి వరకు కంకర వేసి వదిలేయడంతో దుమ్ముతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై వెళ్లే వాహనాల మూలంగా వెలువడే దుమ్ముతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సుమారు 17.3 కి.మీ. దూరం రోడ్డు పనులు చేయాల్సి ఉండగా.. కేవలం 5 కి.మీ. పనులు చేసి వదిలేయడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా వేములలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లల్లో నివసించే వారు దుమ్ముతో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. ఇంటి ఆవరణలో ఉండలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.